# మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

- కొత్త మహిళా సంఘాలు ఏర్పాటుపై అధికారుల దృష్టి
- ఇంటింటికి తిరుగుతున్న ఆర్పీలు
- సభ్యులుగా చేరాలని ప్రచారం


నూతన సంఘాలను ఏర్పాటు చేస్తున్న ఆర్పీ


మహిళలతో మాట్లాడుతున్న మెప్మా పీడీ రవీందర్ (ఫైల్)

ఆర్మూర్‌టౌన్ : మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోంది. మహిళా సంఘాలకు అనేక రుణాలు అందిస్తూ వారికి భరోసాగా నిలుస్తోంది. ప్రస్తుతం ప్రభుత్వం నూతన మహిళా సంఘాల ఏర్పాటుపై దృష్టి సారించింది. సీడీఎంఏ, మెప్మా ఎండీ ఆదేశాలతో పీడీ రవీందర్, ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్ రాజు ఆధ్వర్యంలో ఆర్మూర్ పట్టణంలోని 36 వార్డుల్లో మహిళా స్వయం సహాయక సంఘాల ఏర్పాటుకు కృషి చేస్తున్నారు. ఫిబ్రవరి 4 నుంచి ప్రత్యేక స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. మహిళా సంఘాల్లో చేరని వారిని గుర్తించి ప్రతి 10 మందికి ఒక సంఘంగా ఏర్పాటు చేస్తున్నారు. పట్టణంలో ఆర్పీలు ఇంటింటికి వెళ్లి సర్వే చేసి, మహిళలను సంఘాల్లో చేరుస్తున్నారు. ఇప్పటివరకు 41 కొత్త మహిళా సంఘాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆర్మూర్ పట్టణంలోని 36 వార్డుల్లో 1,160 మహిళా స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. మొత్తం 11,600 మంది మహిళలు ఇప్పటికే సభ్యులుగా ఉన్నారు. ఆర్పీలు చేపడుతున్న సర్వేలను పీడీ రవీందర్, మున్సిపల్ కమిషనర్ రాజు, టీఎంసీ ఉదయ్‌శ్రీ క్షేత్రస్థాయిలో పర్యటించి ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. ఆసక్తిగల మహిళలు ఇంటింటికీ తిరుగుతున్న ఆర్పీల ద్వారా సభ్యత్వం పొందాలని అధికారులు సూచిస్తున్నారు.

### సభ్యత్వం వల్ల వచ్చే లాభాలు

- 6నెలల పొదుపుతో రూ.75 వేల నుంచి రూ. ఒక లక్ష వరకు రుణం పొందే అవకాశం.
- నెలనెలా చెల్లింపులు సక్రమంగా చేస్తే రూ.1 లక్ష నుంచి రూ.20 లక్షల వరకు రుణాలు అందుబాటులో ఉంటాయి.
- ప్రభుత్వ పథకాలు ముందుగా తెలుసుకునే అవకాశం, దరఖాస్తు చేసుకోడానికి ప్రత్యేక సహాయం.
- వ్యాపార అభివృద్ధికి శ్రీనిధి ద్వారా రుణ సదుపాయం పొందే అవకాశం ఉంటుంది.

### ఆర్థికంగా అభివృద్ధి చెందాలి



మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు మహిళా సంఘాల సభ్యత్వం తీసుకుంటే ఒక ఫ్లాట్‌ఫాంగా మారుతుంది. మహిళా సంఘాల్లో ఉంటే అంచెలంచెలుగా ఆర్థికంగా ఎదగవచ్చు. సొంత వ్యాపారాలను మొదలు పెట్టవచ్చు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలి. – రాజు, మున్సిపల్ కమిషనర్, ఆర్మూర్

## పసుపు, ఎర్రజొన్నలను కొనుగోలు చేయాలి


వేల్పూర్‌లో మాట్లాడుతున్న నాయకులు

వేల్పూర్: రాహుల్‌గాంధీ ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం వరంగల్ డిక్లరేషన్ అమలులో భాగంగా ప్రభుత్వమే రైతుల నుంచి ధాన్యం, పసుపు, ఎర్రజొన్నలను కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. డీసీసీబీ డైరెక్టర్ శేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు జైడి నాగధర్‌రెడ్డి, పార్టీ జిల్లా రైతు నాయకుడు మిట్టపల్లి మహిపాల్ గురువారం వేల్పూర్‌లో విలేకరులతో మాట్లాడారు. వ్యాపారులు సిండికేట్‌గా మారి పసుపు, ఎర్రజొన్నల ధరలను భారీగా తగ్గించారన్నారు. నిజామాబాద్ మార్కెట్‌లో పసుపు రైతులను ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పసుపు రైతులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఏమాత్రం పట్టింపులేదని పేర్కొన్నారు. వరంగల్ డిక్లరేషన్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం కచ్చితంగా అమలు చేయాలని లేకుంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు బబ్బూరు ప్రతాప్‌రెడ్డి, రేగుల్లరాములు, నల్లరమేశ్‌రెడ్డి, నోముల రవీందర్, ఏలేటి చిన్నారెడ్డి, బాలకిషన్, పిట్లసత్యం, మొండి అశోక్, బాలయ్య, నాయకులు పాల్గొన్నారు.

## వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి


మాట్లాడుతున్న వైద్యురాలు ఫిర్దోస్ ఫాతిమా

ఆర్మూర్‌టౌన్: విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ప్రభుత్వ ఆస్పత్రి వైద్యురాలు ఫిర్దోస్ ఫాతిమా సూచించారు. ఆర్మూర్ పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో ఉన్న గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థినిలకు పౌష్టికాహారం, ప్రాధాన్యతపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థినులు ప్రతిరోజు పౌష్టికాహారం తీసుకోవాలని, వేసవి కాలం కావడంతో తగు జాగ్రతలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రిక, సూపర్‌వైజర్ శాంతమ్మ, అధ్యాపకులు శిరీష, నిషాత్, వైష్ణవి, విద్యార్థినులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### తడి, పొడిచెత్తపై అవగాహన



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని 7వ వార్డులో కాలనీవాసులకు తడి,పొడి చెత్తపై మున్సిపల్ అధికారులు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శానిటరీ ఎస్సై గజనాంద్ మాట్లాడుతూ.. ప్రజలు ఇంట్లోనే తడి, పొడి చెత్తను వేర్వేరు చేసి ఇంటింటికి వచ్చే మున్సిపల్ చెత్త వాహనానికి అందించాలని సూచించారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పర్యావరణ ఇంజినీర్ పూర్ణమౌళి, వార్డు ఆఫీసర్ విజయ్, మెప్మా ఆర్పీలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

### శివాజీ విగ్రహావిష్కరణ



మోర్తాడ్: మండలంలోని సుంకెట్‌లో బుధవారం రాత్రి ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహావిష్కరణ చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కదారి శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఒడ్డెం ప్రతాప్, నాయకులు తీగెల బొర్ర మల్లేశ్, దుర్కి నవీన్‌గౌడ్, శివాజీ యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

### పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



కమ్మర్‌పల్లి: చౌట్‌పల్లిలోని విద్యుత్ ఉపకేంద్రంలో అధికారులు అదనంగా పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. వేసవి కార్యాచరణ ప్రణాళికలో భాగంగా డిమాండ్‌కు సరిపడా విద్యుత్‌ను వినియోగదారులకు నిరంతరాయంగా సరఫరా చేయడానికి, ప్రస్తుతం ఉన్న 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌కు అదనంగా 3.1 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయగా దానిని ఎంఆర్‌టీ డీఈఈ వెంకటనారాయణ, ఏడీఈ నటరాజ్‌లు గురువారం ప్రారంభించారు. ఏఈ కృష్ణకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

### సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



కమ్మర్‌పల్లి: మండల కేంద్రానికి చెందిన ముగ్గురు బాధితులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను స్థానిక బీఆర్ఎస్ నాయకులు గురువారం పంపిణీ చేశారు. చెక్కుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మైలారం సుధాకర్, మాల్యాల సుభాష్‌గౌడ్, కొంటికంటి నరేందర్ పాల్గొన్నారు.

### ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కార్యశాల



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టీఎస్‌కేసీ ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో సీవీ, రైటింగ్ అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. వర్క్‌షాప్‌లో టీజీఎస్‌డబ్ల్యూఆర్‌డీసీ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావు ప్రధాన వక్తగా పాల్గొని సీవీ, రెస్యూమ్‌ల మధ్య తేడా గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వేణు ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ సునీత, అధ్యాపకులు అంబర్‌సింగ్, లింగన్న, భాను పాల్గొన్నారు.

### పరామర్శ



మాక్లూర్: ఇటీవల అనారోగ్యానికి గురైన మండలంలోని అడవి మామిడిపల్లికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎనుగంటి గంగాధర్‌గౌడ్‌ను గురువారం టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ పరామర్శించారు. ఆయన వెంట పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, కేశవేణు, గడుగు గంగాధర్, శేఖర్‌గౌడ్, రవిప్రకాశ్, కొట్టాల లింగారావు, బి దయాకర్‌రావు, సాయినేని వెంకటేశ్వర్‌రావు, అశోక్, రాజేశ్వర్‌గౌడ్, జంగిడి సతీశ్ ఉన్నారు.

### ఎయిడ్స్‌పై అవగాహన

నవీపేట: మండల కేంద్రంతో పాటు మండలంలోని నాగేపూర్‌లో చైల్డ్ ఫండ్ ఇండియా ఆధ్వర్యంలో గ్రామస్తులకు ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎయిడ్స్‌తో పాటు టీబీ, ఎస్‌టీఐ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లింక్ వర్కర్ వడ్డె రవి, డీఆర్పీ సుధాకర్, సూపర్‌వైజర్ రజిత యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌ఐసీ ఉద్యోగుల సమ్మె


నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

బోధన్: ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ పిలుపు మేరకు గురువారం పట్టణ కేంద్రంలోని ఎల్‌ఐసీ బ్రాంచ్ వద్ద ఉద్యోగులు మధ్యాహ్నం గంట పాటు సమ్మె చేపట్టారు. యూనియన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. సంస్థలో నిలిచిపోయిన 3,4 తరగతి ఉద్యోగుల నియామకాలను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. అంతర్జాతీయ పారిశ్రామిక సంస్థ విధానాలకు అనుగుణంగా ఎల్‌ఐసీలో అతి పెద్ద ఉద్యోగ సంఘమైన ఏఐఐఈఏకు గుర్తింపు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఎస్ రాకేశ్‌కుమార్, ఆర్ నర్సయ్య, సత్యనారాయణ, సంతోష్, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలి


హైదరాబాద్‌కు వెళ్తున్న నాయకులు, సభ్యులు

బోధన్: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ సహాయ కార్యదర్శి గౌతం కుమార్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీ హామీలను అమలు చేయాలనే డిమాండ్‌తో గురువారం హైదరాబాద్‌లో తలపెట్టిన ర్యాలీ, ధర్నాకు గురువారం పట్టణ కేంద్రంలోని న్యూడెమోక్రసీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. ధర్నాకు వెళ్లిన వారిలో పార్టీ డివిజన్ ప్రతినిధులు నడ్పి భూమయ్య, ఎల్ చిన్న పర్వయ్య, పోశెట్టి, విఠల్, దాల్‌మల్కా పోశెట్టి, సుధాకర్, లక్ష్మి, సాయినాథ్, కార్యకర్తలు ఉన్నారు.

### కాంగ్రెస్ నాయకుల ప్రచారం



రుద్రూర్: మండల కేంద్రంలో గురువారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇందూర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి ఆల్ఫోర్స్ నరేందర్‌రెడ్డికి మద్దతుగా కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు పార్వతి ప్రవీణ్, అడ్డసాయిలు, ఇందూర్ కార్తీక్, కర్క అశోక్, షేక్ నిస్సార్, కాసుల సాయిలు తదితరులు పాల్గొన్నారు.

### ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని గెలిపించాలి



ఆర్మూర్‌టౌన్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన అభ్యర్థి అంజిరెడ్డి, మల్క కొమరయ్యను గెలిపించాలని ఆర్మూర్ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి హైదరాబాద్ చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహ కోరారు. పెర్కిట్, కమలానెహ్రూకాలనీ, ఆలూర్‌లో ప్రచారం నిర్వహించారు. నాయకులు పాలెపు రాజు, కలిగొట గంగాధర్, నూతుల శ్రీనివాస్ రెడ్డి, నవీన్ యాదవ్, రుద్రరపు శంకర్, నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఉత్తమ మార్కులు సాధించాలి



పెర్కిట్: విద్యార్థులు కష్టపడి చదివి పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించాలని ఈఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఈరవత్రి రాజశేఖర్ సూచించారు. ఆలూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు గురువారం ఉచితంగా పరీక్ష ప్యాడ్లు, పెన్నులను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మేస నరేందర్, అష్ఫాక్ అహ్మద్, శౌరి రెడ్డి, సైఫ్, అర్గుల్ సురేశ్, రాంప్రసాద్, రాంచందర్, గోపికృష్ణ, ముజాహిద్, విక్రాంత్, సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులు ఇష్టంతో చదవాలి



రెంజల్: విద్యార్థులు ఇష్టంతో చదవాలని ఎంఈవో ఆంజనేయులు సూచించారు. గురువారం రెంజల్‌లోని ఆదర్శ పాఠశాల, కళాశాలలో పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి కళాశాల, పాఠశాలకు గుర్తింపు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో సోమలింగం గౌడ్, కిశోర్‌కుమార్, ఫిరోజ్‌హైదర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### శివాలయంలో ఎమ్మెల్యే పూజలు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టను మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళి నాయక్ భూక్య గురువారం దర్శించుకున్నారు. శివాలయం, రామాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబాగౌడ్, రేగుల్ల సత్యనారాయణ, వెంకటరామిరెడ్డి, కొంతం మురళి, చిట్టిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### కొనసాగుతున్న ఉత్సవాలు

బాల్కొండ: మండల కేంద్రంలో పెద్దమ్మ తల్లి ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు గురువారం రెండో రోజు కొనసాగాయి. ఆలయ ఆవరణలో హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాలు ఆదివారం వరకు కొనసాగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### ఘనంగా బోనాల ఊరేగింపు



ఎడపల్లి: మండలంలోని జైతపూర్‌లో గ్రామస్తులు గ్రామదేవతలకు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు బోనాలను ఊరేగించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో పంటలు బాగా పండాలని, ప్రజలు బాగుండాలని ప్రతి ఏడాది పూజలు నిర్వహిస్తామని గ్రామస్తులు తెలిపారు.

### నకిలీ సరుకులు అమ్ముతున్న వారికి వ్యాపార పర్మిషన్లు ఇవ్వొద్దు

నందిపేట్: ప్రజలను మోసాలు చేస్తూ నకిలీ సరుకులు అమ్ముతున్న వారికి వ్యాపార పర్మిషన్లు ఇవ్వకూడదని మండల ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్స్ శానిటరీ సొసైటీ సభ్యులు కోరారు. ఈ మేరకు గురువారం ఎంపీడీవో శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. సంఘం అధ్యక్షుడు కచ్చకాయల రాజేశ్వర్, స్వర్గం చిరంజీవి, దంతాల అశోక్, గుజ్జేటి సుదర్శన్, మంద శ్రావణ్, గంగాధర్, నాగభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

### విరాళం అందజేత



బోధన్: ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల బాలికల సౌకర్యార్థం ఏడు శానిటరీ ప్యాడ్ వెండింగ్ మెషీన్ల కొనుగోలుకు గురువారం బోధన్‌కు చెందిన విశ్రాంత ప్రభుత్వ ఉపాధ్యాయురాలు గుర్రాల సరోజనమ్మ రూ. 49 వేల నగదు విరాళాన్ని కోర్టు సిబ్బందికి అందించారు. బాలికల గౌరవం, ఆరోగ్యం, పరిశుభ్రతను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఉషాన్, ప్రకాశ్, పద్మాసింగ్, రమణ, నాగేంద్ర పాల్గొన్నారు.

### కేజీబీవీలో ఫిర్యాదుల బాక్స్ ఏర్పాటు

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలోని కేజీబీవీలో గురువారం మండల ప్రత్యేకాధికారిణి స్రవంతి సమక్షంలో ఫిర్యాదుల బాక్సును ఏర్పాటు చేశారు. హాస్టల్, పాఠశాలలో ఎలాంటి సమస్యలు ఉన్నా ఫిర్యాదు బాక్సులో వేయాలన్నారు. అనంతరం పాఠశాలలో మెనూను, నూతనంగా నిర్మిస్తున్న కేజీబీవీ భవనాన్ని పరిశీలించారు. తహసీల్దార్ గజనాన్, ఎంపీడీవో ఆనంద్ నరేశ్, ఎంపీవో గౌస్‌మొయినొద్దీన్, పాఠశాల ఎస్‌వో వినోద, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### నీటి నాణ్యతపై అవగాహన



రెంజల్: భూగర్భ జల శాఖ ఆధ్వర్యంలో రెంజల్ ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో గురువారం నీటి నాణ్యతపై అవగాహన సమావేశం నిర్వహించారు. సంచార నీటి నాణ్యత ప్రయోగశాల(మొబైల్ వాటర్ క్వాలిటీ ల్యాబ్) ద్వారా నీటిని సేకరించి పరీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా భూగర్భ జల శాఖ ఉప సంచాలకుడు శ్రీనివాసుబాబు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా నీటి నాణ్యతను మొబైల్ వ్యాన్ ద్వారా గుర్తిస్తున్నట్లు వివరించారు. ప్రయోగశాల ద్వారా గుర్తించిన నీటి నాణ్యత వివరాలను స్థానికులకు వివరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంపీడీవో వెంకటేశ్‌జాదవ్, శాస్త్రవేత్తలు నికత్ పర్వీన్, హరీశ్, రైతులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### రాష్ట్రస్థాయి పోటీల్లో రుద్రూర్ విద్యార్థుల ప్రతిభ



రుద్రూర్: సిద్దిపేటలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రీడా సాంస్కృతిక పోటీల్లో రుద్రూర్ వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. క్రీడలు, సాంస్కృతిక పోటీల్లో గెలుపొందడంతో పాటు ఓవరాల్ చాంపియన్‌గా నిలిచారని అసిస్టెంట్ ప్రొఫెసర్ మంజు భార్గవి వెల్లడించారు. క్రీడల్లో ప్రతిభ చూపి చాంపియన్‌గా నిలిచిన విద్యార్థులను వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ టి అంజయ్య గురువారం అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

### యుద్ధభేరిని విజయవంతం చేయండి



రుద్రూర్: సీపీఎస్, యూపీఎస్‌ను వ్యతిరేకిస్తూ వచ్చే నెల రెండున హైదరాబాద్‌లో నిర్వహించే యుద్ధ బేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కత్రి విక్రమ్‌సింగ్ కోరారు. కోటగిరి, రుద్రూర్, బోధన్, మోస్రా, చందూర్ మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో, జూనియర్ కళాశాలల్లో, రుద్రూర్ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో యుద్ధభేరి మహాధర్నా గోడ ప్రతులను గురువారం ఆవిష్కరించారు. దేవళ్ల గోపాల్, రాములు, శ్రీనివాస్, రవితేజ, సంగీత, లత, సునీత, షేక్ ఈసా, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

### విద్యుత్ అధికారుల పొలం బాట



నవీపేట: మండలంలోని జన్నెపల్లిలో ట్రాన్స్‌కో అధికారులు గురువారం పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. ట్రాన్స్‌కో డీఈ రమేశ్ ట్రాన్స్‌ఫార్మర్ లైన్ సర్వీస్ దగ్గర పాటించాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. కెపాసిటర్ ఏర్పాటు ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో అధికారులు, రైతులు పాల్గొన్నారు.

### స్టైఫండ్ ఇవ్వాలని ఆందోళన

కోటగిరి: పుట్ట గొడుగుల పెంపకంపై శిక్షణ పూర్తి చేసి రెండేళ్లు గడిచినా స్టైఫండ్ రాలేదని యువకులు కోటగిరి మండల పరిషత్ కార్యాలయం ఎదుట గురువారం ఆందోళన చేశారు. మండలంలోని ఎక్లాస్‌పూర్‌కు చెందిన కొందరు యువకులకు డిచ్‌పల్లి ఆర్‌ఎస్‌ఈటీఐ ద్వారా పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ ఇచ్చారు. ఈ సమయంలో రావాల్సిన స్టైఫండ్ తమకు ఇవ్వకుండా ట్రైనింగ్ చేయని వారికి ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తమకు రావాల్సిన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

### నిరసన యాత్రను జయప్రదం చేయాలి

పెర్కిట్: వ్యవసాయ మార్కెట్ విధానాల ముసాయిదాను కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని శుక్రవారం చేపట్టనున్న రైతుల నిరసన యాత్రను జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేశ్ కోరారు. మామిడిపల్లిలో గురువారం నిరసన యాత్రకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రైతు నాయకులు టి భూమన్న, పెద్ద రాయుడు, కారం చిన్న రాజన్న, పూత సాయన్న, ఎన్ గంగారాం, నరేశ్, డి రాజన్న తదితరులు పాల్గొన్నారు.

### నేడు రైతు నిరసన యాత్ర

ఆర్మూర్‌టౌన్: తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో మార్కెట్ ముసాయిదాను కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం రైతు నిరసన యాత్ర చేపడుతున్నట్లు సంఘం జిల్లా కార్యదర్శి వెంకటేశ్ పేర్కొన్నారు. యాత్రను రైతులు విజయవంతం చేయాలని కోరారు.

### వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



**పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)**

| | |
|---|---|
| స్క్రీన్-1 | ది డెవిల్స్ చైర్(తెలుగు)-10.40, రామం రాఘవం(తెలుగు)-1.55, జాబిలమ్మ నీకు అంత కోపమా(తెలుగు)-4.30, 7.20, 10.10 |
| స్క్రీన్-2 | రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)-10.15, 4.00, 7.10, 10.20, బాపు(తెలుగు)-1.25 |
| స్క్రీన్-3 | జాబిలమ్మ నీకు అంత కోపమా(తెలుగు)-10.10, రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)-1.00, ఛావా(హిందీ)-4.10, బాపు(తెలుగు)-7.30, తండేల్(తెలుగు)-10.05 |
| స్క్రీన్-4 | బాపు(తెలుగు)-10.30, తండేల్ (తెలుగు)-1.05, సంక్రాంతికి వస్తున్నాం (తెలుగు)-4.10, ఛావా (తెలుగు) - 7.10, 10.30 |

**ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)**

| | |
|---|---|
| స్క్రీన్-1 | జాబిలమ్మ నీకు అంత కోపమా -11.00, 1.40, 7.30 రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్-4.30, 10.20 |
| స్క్రీన్-2 | ఛావా(హిందీ)-11.00,1.40,4.40, 7.30, 10.20 |
| స్క్రీన్-3 | తండేల్(తెలుగు)-1.45, 4.40, 7.30 బాపు(తెలుగు)-10.30 |

**పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)**

| | |
|---|---|
| స్క్రీన్-1 | రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)-10.15, 4.00, 7.10, 10.20 బాపు(తెలుగు)-1.25 |
| స్క్రీన్-2 | ఛావా(హిందీ)-10.00, 7.20, 10.40 రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)-1.20 జాబిలమ్మ నీకు అంత కోపమా -4.30 |
| స్క్రీన్-3 | జాబిలమ్మ నీకు అంత కోపమా-10.30 ఛావా(హిందీ)-1.20 తండేల్(తెలుగు)-4.40, 10.20 బాపు(తెలుగు)-7.45 |
| స్క్రీన్-4 | ది డెవిల్స్ చైర్(తెలుగు)-11.30 రామం రాఘవం(తెలుగు)-1.45 ఛావా(హిందీ)-4.20 సంక్రాంతికి వస్తున్నాం(తెలుగు)-7.40 జాబిలమ్మ నీకు అంత కోపమా-10.40 |
| లలితామహల్ | తండేల్(తెలుగు) |
| దేవి | జాబిలమ్మ నీకు అంత కోపమా(తెలుగు)-11.15, 6.15 రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)-2.15, 9.15 |
| నటరాజ్ | ఛావా(హిందీ) |
| విజయ్ | సంక్రాంతికి వస్తున్నాం (తెలుగు) |

### బంగారం ధరలు (10గ్రాములు)

| | | | |
|---|---|---|---|
| 24 క్యారెట్స్ | 89,700 | వెండి(కిలో) | 1,02,000 |
| 22 క్యారెట్స్ | 82,710 | | |

– నిజామాబాద్ బిజినెస్

### మాంసం ధరలు

| చికెన్ | ధరలు (కిలోకు) | | |
|---|---|---|---|
| | | డ్రెస్డ్ | 160 |
| | | లైవ్ | 100 |
| స్కిన్‌లెస్ | 180 | మటన్ | 800 |